క్లుప్తంగా

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు



గర్భిణుల ఆరోగ్యం గూర్చి ఆరాతీస్తున్న వైద్యురాలు సాయిప్రసన్న

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని గెడ్డితిరువాడ ఆరోగ్య ఉప కేంద్రంలో గర్భిణులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆస్పత్రికి వచ్చిన ప్రతి గర్భిణి ఆరోగ్యం పరీక్షించి, సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీ నియామకం

వీరఘట్టం: వైఎస్సార్ సీపీ మండల కమిటీ నియామకం సోమవారం జరిగింది. ఉపాధ్యక్షులుగా పన్నింటి శ్రీనివాసరావు, సతివాడ చిన్నంనాయుడు, సాధారణ కార్యదర్శులుగా మర్రాపు ఉమామహేశ్వరరావు, దూసి జానకమ్మ, నీలం సత్యంనాయుడు, పత్తిక కామేశ్వరరావులు, కార్యదర్శులుగా యాకల దుర్గారావు, సాధు దామోదరరావు, సవర ఆనందరావు, అలజంగి మణమ్మ, వావిలపల్లి సన్యాసినాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కురిటి సిద్ధార్ధ, ఆబోతుల దాలినాయుడు, రొంగళి స్వామినాయుడు, మంగిపూడి రాంబాబు, నడిమింటి మోహనరావు, మాచర్ల వెంకటరమణ, బవిరి సుదర్శనరావు, ఉదయాన అమ్మాజీ, ఆర్.సూరప్పనాయుడు, ఉదయాన కాంతారావు, భోగి మదన్‌కుమార్, తొత్తరపుడి వరప్రసాద్, దొలూరు వరప్రసాద్, కర్రి శంకరరావు, కిల్లారి రామకృష్ణ, గోల అక్కంనాయుడు, ధనపతి శేఖర్, పిల్లా ఆంజనేయులు, గంధవరపు మురళి, కోడూరు సత్యంనాయుడు, సఖినాన స్వామినాయుడు, వి.సన్యాసినాయుడు, కె.అప్పలనాయుడు, డి.ఆదినారాయణ, పలగర దుర్గారావు, గొర్లె రాము, ఎస్.మారయ్య, పిట్టా చంద్రరావు, నీలం శ్రీనివాసరావు, గొర్లె బలరాం, బి.అమృతరావు, జీవరత్నం, నీలం జగన్నాథంనాయుడు, కలమట రామకృష్ణ, తాడేల వెంకటనాయుడు, జరజాపు శ్రీనివాసరావు, ఎచ్చర్ల కృష్ణంనాయుడు, దనుకొండ దనుంజయరావు, బిడ్డిక కామేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు సదరు సభ్యులకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

సాలూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలను పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. తమ జీతాలు పెంచాలని కోరుతూ జూన్ 6 వతేదీ నుంచి 14 రోజుల తరువాత ఏ రోజునుంచైనా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ డీఈ ప్రసాద్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు ,యూనియన్ నాయకులు అమర్‌కుమార్,దుర్గ తదితరులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో ఇంజినీరింగ్ సెక్షన్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 12 వేల మంది కార్మికులు తమ పని నైపుణ్యానికి తగిన జీతాలు అందకపోవడంతో నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో కుటుంబాలు గడవక అర్ధాకలితో బతుకుతున్నారని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి, ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మె నోటీసు అందించిన నాటి నుంచి 14 రోజుల తర్వాత ఏరోజు నుంచైనా సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉమామహేశ్వరరావు, రఘు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే



బలిజిపేట అంగన్వాడీ కేంద్రంలో సర్వే చేస్తున్న అధికారులు

బలిజిపేట: అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వేను నిర్వహించినట్లు ఎంఈఓ-2కె.శ్రీనివాసరావు తెలిపారు. అందులో భాగంగా బలిజిపేట అంగన్వాడీ కేంద్రంలో సోమవారం సర్వేను నిర్వహించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఉండే పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి దివ్యాంగ చిన్నారుల గుర్తింపు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికి 11మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని పాఠశాలల్లో చేర్పించినట్లు ఐఈఆర్‌పీ రమణమ్మ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం



బిల్లులు చెల్లించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న సభ్యులు

- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం
- కోరం లేకుండా సమావేశం నిర్వహణపై సభ్యుల నిలదీత
- బిల్లుల కోసం సంతకాలు ఫోర్జరీ చేయడంపై మండిపాటు
- ఎంపీడీవో ఎవరు? సమావేశం నాది అంటూ ఎంపీపీ ఆగ్రహం



సమావేశానికి హాజరైన సభ్యులు

జియ్యమ్మవలస రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. తొలుత ఎంపీడీవో కె.ధర్మారావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని, సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశం సజావుగా జరిగేందుకు సభ్యులు సహకరించాలని కోరారు. ఈ క్రమంలో గతంలో జరిగిన సర్వసభ్య సమావేశం తీరుపై సభ్యులు మండిపడ్డారు. అప్పట్లో ఎంపీడీవో లేని సమయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పంచాయతీరాజ్ ఏఈ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాన్ని కోరం లేని కారణంగా సభ నుంచి వాకౌట్ చేస్తే తమ సంతకాలు ఫోర్జరీ చేసి బిల్లుల కోసం ఎందుకు వినియోగించుకున్నారని వైఎస్సార్ సీపీ సభ్యులు సంపత్‌కుమార్(వైస్ ఎంపీపీ), రమేష్‌నాయుడు(ఖిఖబడి సర్పంచ్) ఎంపీడీవోను నిలదీశారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ ఎంపీడీవో ఎవరు.. సభ నాది మీకు ఇష్టం ఉంటే ఉండండి లేకుంటే వెళ్లిపోండి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం జరిగి 90 రోజులైందని, దీనిపై ఇంతవరకు ఎందుకు ప్రశ్నించలేదని ఎదురుదాడికి దిగారు. గత సమావేశానికి తాను హాజరుకాకపోయినా తన సంతకాన్ని రికార్డుల్లో ఎలా చేర్చారని కన్నపుదొరవలస ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి రవికుమార్ ధ్వజమెత్తారు. ఇలా కాసేపు ఎంపీపీ, సభ్యుల మధ్య కొంత సమయం వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంపీడీవో స్పందించి, సంతకాల ఫోర్జరీపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జరిగిన సమావేశం కొనగింపులో పలువురు అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు.

విద్యుత్ స్తంభాలు వేయండి..

జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలంలోని 18 గ్రామాలకు తాగునీటి పథకాలు, 51 సామూహిక మరుగుదొడ్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తెలిపారు. గృహ నిర్మాణ శాఖలో 298కి 60.. 1610 గ్రామీణ ఇళ్లకు 391.. పీఎం జన్‌మన్ పథకం 209కి 7 ఇళ్ల పనులు జరుగుతున్నట్లు గృహ నిర్మాణ శాఖ అధికారి పేర్కొన్నారు. కొండచిలకాం పంచాయతీలో 40 వరకు ఐరన్ విద్యుత్ స్తంభాలు మరమ్మతులకు గురై ప్రమాదకరంగా కనిపిస్తున్నాయని సర్పంచ్ గణేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. పాడైన స్థంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఏఈ శంకరరావు స్పందించి, కొత్త స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్నామని, మధ్యాహ్న భోజన పథకం కింద సన్నబియ్యాన్ని పాఠశాలలకు అందిస్తున్నామని ఎంఈవో శ్రీనివాసరావు వెల్లడించారు. పరజపాడు నుంచి పెదకుదమకు రోడ్డు నిర్మించాలని, అలాగే గోశాలలు, నీటితొట్టెలు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణాలకు సంబంధించి బిల్లులు చెల్లించడం లేదని, పనులు జరిగిన తర్వాత ఇంత ఆలస్యమెందుకని పరజపాడు సర్పంచ్ శెట్టి రామకృష్ణ ప్రశ్నించారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సొంత పార్టీ వారికే కుట్టుమిషన్ శిక్షణా?

ఉపాధి హామీ పథకం పనుల కింద సొంత డబ్బులతో రూ.2.5 లక్షల పెట్టుబడి పెట్టి 2,400 మొక్కలు నాటామని, దాని నిధులు ఇంతవరకు చెల్లించడం లేదని అలమండ సర్పంచ్ చంటి ఆవేదన వ్యక్తం చేశారు. కుట్టుమిషన్ శిక్షణ కూడా సొంత పార్టీ వ్యక్తులకే ఎంపిక చేశారని ఖబడి సర్పంచ్ కోట రమేష్‌నాయుడు విమర్శించారు. తల్లికి వందనం ఇస్తారా లేదా అని సభ్యులు అడిగిన ప్రశ్నకు ఎంఈవో శ్రీనివాసరావు సమాధానమిస్తూ జూన్ 12వ తేదీలోగా ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు.



సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ బొంగు సురేష్

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కొమరాడ: మండలంలోని స్వామినాయుడు, గంగారేగువలస, గుంప, కోటిపాం, గుమడ తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొబ్బిలి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులంతా ఊరూరా వాహనం ద్వారా వెళ్లి, త్రైత సిద్ధాంతం గూర్చి ప్రజలకు తెలియజేశారు. ఆత్మ, పరమాత్మ, జీవాత్మల గూర్చి తెలుసుకోవడమే సిద్ధాంతమన్నారు. భగవద్గీతలో కర్మ, బ్రహ్మ, భక్తి యోగాలనుసారం నడుచుకుంటే కర్మ నుంచి బయటపడి మనిషికి ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎం.వెంకటరావు, కల్యాణి మేఘన, శంకరరావు, నాగలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో సంస్థ సభ్యులు

ఘనంగా చర్చి పండుగ

భామిని: మండలంలోని బత్తిలి ఆర్‌సీఎం చర్చి పండుగ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి, బిషప్ రాయరాల విజయ్‌కుమార్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన దివ్యపూజ బలిలో ఆయన వాక్యోపదేశం చేసి, ఏసుక్రీస్తు సందేశం వినిపించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు క్రీస్తు ఆరాధన గీతాలకు చేసిన నృత్యాలు, గీతాలాపనలు అలరించాయి.

గర్భిణులకు అన్నదానం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయం వద్ద గర్భిణులకు అన్నదానం చేశారు. నెలవారీ వైద్య తనిఖీల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం వచ్చిన గర్భిణులకు తనిఖీల అనంతరం మధ్యాహ్నం మందిరం వద్ద భోజనాలు ఏర్పాటు చేసి అందజేశారు. దాతల సహకారంతో ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ అన్నారు.

భామిని: పీఎంఎస్ఎంఏ(ప్రధానమంత్రి సురక్షిత మాతృ అభియాన్) కింద నెలవారీ వైద్య తనిఖీల నిమిత్తం మండలంలోని బాలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం వచ్చిన గర్భిణులకు వైద్యాధికారి కె.శివకుమార్ వైద్య తనిఖీలు చేసి, సంపూర్ణ ఆరోగ్యానికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. మధ్యాహ్నం సత్యసాయి భక్తులు గర్భిణులకు అన్నదానం చేశారు.



భోజనాలు చేస్తున్న గర్భిణులు

దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న దృశ్యం

సీతంపేట: మండల పరిధిలోని శంభాం, ముత్యాలు, ఓంద్రుజోల, మల్లి ఆశ్రమ పాఠశాలలు సహా సీవోఈ కళాశాలల్లో దోమల నివారణ మందు పిచికారీ సోమవారం చేపట్టారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యాసంస్థల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ఆహ్లాదకర వాతావరణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి పి.వి.సత్యనారాయణ సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలు పునరుద్ధరించాలి



సీతంపేట: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతంపేట/పాలకొండ: ఎండీయూ వాహనాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీతంపేట, పాలకొండ మండల కేంద్రాల్లోని తహసీల్దారు కార్యాలయాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. సీతంపేటలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు, పాలకొండలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నేత దావాల రమణారావు మాట్లాడారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయూ వాహనాలను ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పార్టీలకు పోయి ప్రజలకు నష్టం కలిగించే చర్యలకు ఉపక్రమించడం సరికాదన్నారు. ఇదివరకు ఆ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ జరిగేదని, దీంతో ఉన్నచోటకే రేషన్ వచ్చేదని, ఇప్పుడు అలా కాదని మళ్లీ రేషన్ దుకాణాల వద్దకే వెళ్లమని చెప్పడం దారుణమన్నారు. ఎక్కడైనా పాలన సులభతరం కావాలనుకుంటారు కానీ చంద్రబాబు ప్రభుత్వం మాత్రం దానికి విరుద్ధంగా నడుస్తోందని దుయ్యబట్టారు. ఎండీయూ వాహనాలు లేకపోవడం వల్ల ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లోని వారు నరకయాతన పడుతున్నారన్నారు. రేషన్ కోసం కొండలు, గుట్టలు దాటి రాళ్లు తేలిన రోడ్డుపై ప్రమాదకరంగా నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మళ్లీ అదే దారిలో రేషన్ సరుకుల బరువుతో రావాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా పార్టీలకు పోయి నిర్ణయాలు తీసుకోకుండా ప్రజలకు మేలు జరిగే చర్యలు చేపట్టాలని హితవు పలికారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.సాంబయ్య, ఎ.భాస్కరరావు, కె.రాము, డి.దుర్గారావు, ఎస్.నాగరాజు, ఎన్.గోవింద, ఎస్.సుధా తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కొమరాడ: పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేయాలని సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి సోమవారం వెళ్లి, అక్కడి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత రేషన్ విధానంతో గిరి శిఖర గ్రామాల్లోని ప్రజలు రేషన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మరోసారి పునరాలోచించాలని ఆయన కోరారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రెడ్డి శివన్నాయుడు తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం: ఇంటి వద్దకే రేషన్ పంపిణీ అయ్యేలా ఎండీయూ వాహనాలు నడపాలని సీపీఎం నాయకులు మండంగి రమణ, బి.అడిత్తో, ఎం.సన్యాసిరావు, బి.శ్రీనివాసరావు కోరారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గతంలోని ప్రభుత్వం అమలు చేసిన ఎండీయూ వాహనాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి, ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడే వారు రేషన్ తీసుకునేందుకు, వాటిని మోసుకుని ఇంటికి వచ్చేందుకు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మరోసారి ఆలోచన చేయాలని, ఎండీయూ వాహనాలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.



కొమరాడ: వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు సాంబమూర్తి, తదితరులు



గుమ్మలక్ష్మీపురం: ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, తదితరులు

వెండి కిరీటం బహూకరణ



గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లిలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామికి మండలంలోని గిజబ గ్రామానికి చెందిన కెంగువ మణికుమార్ దంపతులు వెండి కిరీటం బహూకరించారు. రూ.లక్ష విలువైన కిలో వెండితో ఈ కిరీటం తయారు చేయించినట్లు దాతలు తెలిపారు. ఈ కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఆలయ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావస్తుండడం అభినందనీయమని, దాతలకు కృతజ్ఞతలని వారు తెలిపారు.

ధర్నా



పాలకొండ తహసీల్దారు కార్యాలయం ఎదుట కౌలురైతులు సోమవారం ధర్నాకు దిగారు. రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తమకూ అన్నదాత సుఖీభవం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే గుర్తింపుకార్డులు అందివ్వాలని, పెండింగ్‌లోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తానన్న రూ.20 వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో కె.రామ్మూర్తి నాయుడు, బి.పారినాయుడు, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

–పాలకొండ

రాళ్లు తేలిన రోడ్డు



పాలకొండ మండలం, బద్దుమాసింగి గ్రామం వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు పొడవునా రాళ్లు తేలిపోయి ఉన్నాయి. దీంతో ఆ వైపుగా ప్రయాణించేందుకు గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాహనాలపై వెళ్తుంటే గోతుల కారణంగా తలెత్తే కుదుపులకు ఒళ్లు హూనమైపోతోందని వాపోతున్నారు. రోడ్డు బాగు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–పాలకొండ రూరల్

దుక్కులకు నోచుకోని సాగుభూమి



పాలకొండ మండలంలోని పలు ప్రాంతాల్లోని సాగుభూమలు దుక్కులకు నోచుకోవడం లేదు. సాగుకు అవసరమైన పెట్టుబడి లేకపోవడంతో పంటలు పండించేందుకు రైతులు ముందుకు రావడం లేదు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా ఖరీఫ్ సాగు సమయానికే రైతు భరోసా కింద సాగు సాయం ఇవ్వడంతో పంటల సాగు చక్కగా చేసుకునేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తానన్న రూ.20 వేలు ఇంకా జమ చేయకపోవడంతో సాగు పనులకు డబ్బులు లేకపోవడంతో ఎక్కడా దుక్కి పనులు జరగడం లేదు. ప్రభుత్వం త్వరగా డబ్బులు వేస్తే పనులు చేసుకుంటామని పలువురు రైతులు అంటున్నారు. ఇంకా దుక్కి చేయని భాసూరు-అర్దలి గ్రామాల మధ్య పొలాలను చిత్రంలో చూడొచ్చు.

–పాలకొండ రూరల్

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి



పాలకొండ: కొండాపురం ర్యాలీలో నినాదాలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



వీరఘట్టం: నడిమికెల్లలో జరిగిన ర్యాలీలో గ్రామస్తులు

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాలకొండ మండలంలోని కొండాపురం, పరశురాంపురం, వెలగవాడ గ్రామాలు సహా వీరఘట్టం మండలంలోని నడిమికెల్ల గ్రామం, గరుగుబిల్లి మండల కేంద్రంలో యోగాపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ చేపట్టారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు యోగా ఆవశ్యకత, యోగాసనాల సాధన-వాటి ప్రయోజనాలు వివరించారు. ప్రతిఒక్కరి నిత్య జీవితంలో యోగా భాగం కావాలని, యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం లభించడంతో పాటు మనసుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారొచ్చన్నారు.

–పాలకొండ, వీరఘట్టం, గరుగుబిల్లి



గరుగుబిల్లిలో యోగాపై అవగాహన కల్పిస్తూ ఎంపీడీవో పైడితల్లి ర్యాలీ